క్లుప్తంగా

క్రీడలకు ప్రభుత్వం పెద్ద పీట



ఇండోర్ స్టేడియాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి

నందికొట్కూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం క్రీడలకు పెద్ద పీట వేసిందని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణ సమీపంలోని పగిడ్యాల రోడ్డులో నిర్మించిన ఇండోర్ స్టేడియాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 15న ఆంధ్రప్రదేశ్ పర్యాటక, సాంస్కృతిక, యువజనాభివృద్ధి శాఖ మంత్రి ఆర్.కే. రోజా స్టేడియాన్ని ప్రారంభిస్తారని చెప్పారు. నియోజకవర్గంలో నందికొట్కూరు, పగిడ్యాల మండలాల్లో రూ. 2.38 కోట్లతో ఇండోర్ స్టేడియాల నిర్మాణాలను పూర్తి చేయడం జరిగిందని చెప్పారు. ఆయన వెంట శాప్ నంద్యాల జిల్లా కో ఆర్డినేటర్ రవికుమార్, కర్నూలు జిల్లా కో ఆర్డినేటర్ శ్రీనాథ్, జెడ్పీటీసీ జగదీశ్వరరెడ్డి, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగిరెడ్డి, శివరామకృష్ణారెడ్డి, శివనాగిరెడ్డి, నాగార్జునరెడ్డి, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులర్ చేయాలి

ఆత్మకూరు: ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులర్ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏసురత్నం డిమాండ్ చేశారు. పట్టణంలోని ధనుంజయ మీటింగ్‌హాల్‌లో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీలో కొందరు వైస్ ఛాన్స్‌లర్లు కళాశాలల్లో పనిచేసే కాంట్రాక్ట్ అధ్యాపకులను వేధింపులకు గురి చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రామ్‌నాయక్, నరసింహానాయక్, ఎలిషా, రమేష్ పాల్గొన్నారు.

క్రైస్తవులపై దాడులు అమానుషం

ఆత్మకూరు: మణిపూర్‌లో క్రైస్తవులపై దాడులు జరగడం అమానుషమని ఆత్మకూరు ఏరియా ఆల్ డినామినేషన్ పాస్టర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు శీలం శేషు, పాస్టర్లు రమేష్, పేతూరు, ఏసేబ్‌నాయక్ అన్నారు. పట్టణంలోని దుద్యాల రస్తాలోని ప్రార్థనా మందిరం వద్ద బుధవారం నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ మణిపూర్ క్రైస్తవులపై మతోన్మాదులు దాడులు చేయడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వం సత్వరమే స్పందించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు సుధాకర్, రమేష్, అశోక్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య చర్యలు చేపట్టండి

పగిడ్యాల: వర్షకాలం ప్రారంభమైనందున గ్రామాలలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ వెంకటరమణ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పది గ్రామ సచివాలయాల పరిధిలో పనిచేసే పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డ్రైనేజీ కాలువల్లోని పూడికను తొలగించి దోమల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నాగేంద్రయ్య, పంచాయతీ కార్యదర్శులు ఉపేంద్రారెడ్డి, జావేద్, సమతయశోదర, వీరన్నయాదవ్, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐటీఐ)లో ప్రవేశానికి రెండో విడత దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎ.రవీంద్రబాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రెండు సంవత్సరాల ఫిట్టర్, టర్నర్, ఎలక్ట్రీషియన్, మెకానిక్, మోటార్ వెహికల్, 1 సంవత్సరం కోర్సులైన మెకానిక్ డీజిల్, వెల్డర్ ట్రేడ్లలో సీట్లు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. వెల్డర్ ట్రేడర్‌లోకి చేరేందుకు 10వ తరగతి ఫెయిల్ వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. www. iti. ap. gov. in వెబ్‌సైట్‌లో ఈనెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు సెల్ 9705683537, 9502722811 లకు సంప్రదించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పగిడ్యాల: స్థానిక 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో అదనంగా 5 మెగా ఓల్ట్ ఆంపీయర్‌ను అమరుస్తున్నందున గురువారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ క్రాంతికుమార్ బుధవారం తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. మండలంలోని గృహ, వ్యవసాయ కనెక్షన్ కలిగిన వినియోగదారులు గమనించాలని కోరారు.

ఆర్బీకేల తనిఖీ

వెలుగోడు: మండలంలోని రేగడ గూడూరు 1,2, వేల్పనూరు రైతు భరోసా కేంద్రాలను మండల వ్యవసాధికారి పవన్ కుమార్ తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కౌలు రైతులకు గుర్తించి గుర్తింపు కార్డు వెంటనే ఇప్పించాలని, మట్టి నమూనాలను త్వరగా సేకరించి ల్యాబ్ లకు పంపాలని ఆదేశించారు. అనంతరం వేల్పనూరు గ్రామంలోని రిటైల్ దుకాణాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యాన సహాయకులు స్వర్ణ, రూప, లక్ష్మీ ప్రసన్న, భవ్య తదితరులు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్ క్షమాపణ చెప్పాలి

- అనుచిత వ్యాఖ్యలపై భగ్గుమన్న వలంటీర్ల
- మండ్లెంలో పవన్‌కల్యాణ్ ఫొటోకు చెప్పుల దండవేసి నిరసన



పవన్‌కల్యాణ్ ఫొటోకు చెప్పులదండవేసి సచివాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న మండ్లెం వలంటీర్లు

జూపాడుబంగ్లా: పవన్‌కల్యాణ్ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడకపోతే పుట్టగతులుండవని వలంటీర్లు ప్రకాశ్, దేవనాయక్, రవికుమార్, శివభారతి, ప్రభావతి, వైస్ ఎంపీపీ తోకల కృష్ణారెడ్డి, జేసీఎస్ మండల అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, ఆనంద్ రజక హెచ్చరించారు. వలంటీర్లపై చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బుధవారం మండ్లెం సచివాలయం-1 వద్ద పవన్‌కల్యాణ్ ఫొటోకు చెప్పులదండ వేసి.. డౌన్ డౌన్ అంటూ నినదిస్తూ నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ చంద్రబాబు దత్తపుత్రుడైన పవన్‌కల్యాణ్ సినిమాల్లో లాగా బయట నోటికొచ్చినట్లు మాట్లాడితే నోటిపళ్ల ఊడుతాయన్నారు. నిస్వార్థంగా సేవలు చేస్తున్న వలంటీర్లపై ఎలాంటి ఆధారాల్లేకుండా ఇష్టానుసారంగా మాట్లాడటం తగదన్నారు. కరోనా, వరదలు వంటి విపత్కర పరిస్థితుల్లో వలంటీర్లు నిస్వార్థంగా, ధైర్యంగా వారి పరిధిలోని ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందేలా చేశారని తెలిపారు. నీ వెంట తిరుగుతున్న వారిలో 80శాతం మంది ఇళ్లకు వలంటీర్లు సంక్షేమ పథకాలు అందేలాచేశారని తెలిపారు. వలంటీర్ల వల్ల రాష్ట్రంలో ఒంటరి మహిళలు అదృశ్యమవుతున్నారని పేర్కొనటం హాస్యాస్పదంగా ఉందన్నారు. వలంటీర్లుగా విధులు నిర్వహిస్తున్న మహిళలు తోటి మహిళలు కనిపించకుండా పోయేలా చేశారని తప్పుగా మాట్లాడటాన్ని చూస్తే మహిళలంటే ఆయనకు ఎంత చులకనభావం ఉందో అర్థమవుతుందన్నారు. మూడు పెళ్లిళ్లు చేసుకొన్న ఆయనకు మహిళలంటే కించింతైనా గౌరవం ఉంటే వెంటనే వలంటీర్లపై చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకొని వలంటీర్లకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వలంటీర్లు ఫైరజ్, షేకూన్‌బీ, ప్రభావతి, లలిత, చాంద్‌బాషా, ముర్తుజావలి, నీహారిక, అమీర్‌బాను, రాంబాబునాయక్, పుల్లంరాజు, రంగన్న, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గడపకు సంక్షేమ దివ్వెలు

- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- శింగవరం, రామాపురంలో 'గడప గడపకు మనప్రభుత్వం'
- శింగవరంలో టీడీపీ వీడి వైఎస్సార్‌సీపీలో చేరిన 50 కుటుంబాలు



శింగవరంలో వర్షంలోనే గడప గడపకు మన ప్రభుత్వం కొనసాగిస్తున్న ఎమ్మెల్యే శిల్పా



టీడీపీని వీడి శిల్పా సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన నాయకులు

మహానంది: జగనన్న పాలనలో ప్రతి గడపలోనూ సంక్షేమ దివ్వెలు వెలుగుతున్నాయని, ప్రజాసాధికారతే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. బండిఆత్మకూరు మండలం శింగవరం, రామాపురం గ్రామాల్లో నియోజకవర్గ సీనియర్ నేత శిల్పా భువనేశ్వర్‌రెడ్డితో కలిసి బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు విరామం లేకుండా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వర్షం కురుస్తున్నప్పటికీ లెక్కచేయకుండా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించి, వారి సమస్యలను తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచి ప్రశంసలు వస్తుంటే, ఓర్వలేని దత్తపుత్రుడు సంస్కారం లేకుండా వ్యాఖ్యలు చేయడం ప్రజాగ్రహానికి గురిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సంజీవరెడ్డి, శింగవరం ఎంపీటీసీ సభ్యుడు చింతల రామయ్య, రామాపురం సర్పంచ్ పుల్లయ్య, నాయకులు లింగాల సుబ్బయ్య, మంగలి శ్రీనివాసులు, లింగాల బూర్గయ్య, దాసరి పుల్లయ్య, సుబ్బయ్య యాదవ్, ఎస్.మహబూబ్‌బాషా, విక్రమసింహనాయక్, ముడిమెల పుల్లారెడ్డి, దీపుకాంత్‌రెడ్డి, మాజీ ఎంపీపీ దేసు వెంకట్రామిరెడ్డి , బారెడ్డి శ్రీనివాసరెడ్డి, అవుటాల నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి 50 కుటుంబాలు

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంక్షేమ పాలనకు ఆకర్షితులైన శింగవరం గ్రామానికి చెందిన 50 కుటుంబాలు బుధవారం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. గ్రామానికి చెందిన శూల వెంకటేశ్వర్లు, శూల రామాంజనేయులు, రాముడు, జైలాన్‌బాషా, కూసు నాగిరెడ్డి, దబ్బరి శివ, కురువ మహేష్‌తో పాటు 50 కుటుంబాల వారు పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి కండువాలు కప్పి ఆహ్వానం పలికారు.

బయోలాజికల్ టీచర్స్ డైరీ ఆవిష్కరణ

శింగవరంలో బయోలాజికల్ టీచర్స్ డైరీని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఎంఈఓలు మోహన్‌రెడ్డి, యశోద, ఫోరం కన్వీనర్ చింతకుంట్ల చంద్రశేఖర్‌రెడ్డి డైరీ ప్రాముఖ్యతను ఎమ్మెల్యే శిల్పాకు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు లింగాల సుబ్బయ్య, చక్రపాణి పాల్గొన్నారు.

మంత్రి పర్యటన ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లపై సమీక్షిస్తున్న పార్టీ శ్రేణులు

పగిడ్యాల: నియోజకవర్గంలోని పగిడ్యాల, నందికొట్కూరు మండలాలల్లో ఈనెల 15న రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మాత్యులు ఆర్కే రోజా పర్యటన నేపథ్యంలో బుధవారం రూట్ మ్యాప్ ఏర్పాట్లను ముచ్చుమర్రి ఎస్ఐ నాగార్జున, మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తువ్వా శివరామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వై. చంద్రమౌళి, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి పర్సనల్ సహాయకులు అఖిలేష్‌యాదవ్ పరిశీలించారు. రూ. 2.38 కోట్ల వ్యయంతో నిర్మించిన ఇండోర్ స్టేడియాల ప్రారంభోత్సవాన్ని, మంత్రి పర్యటనను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులను కోరారు. షెడ్యూల్ ప్రకారం మంత్రి పర్యటన ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఉన్నందున శాంతిభద్రతలపై సమీక్షించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న, మాజీ జెడ్పీటీసీ పుల్యాల నాగిరెడ్డి, తదితరులు ఉన్నారు.

గుడిసెలకు విద్యుత్ మీటర్ ఇవ్వాలి

నందికొట్కూరు: గుడిసెలు వేసుకున్ని నివాసం ఉంటున్న బుడగ జంగాలకు విద్యుత్ మీటర్లు ఇవ్వాలని సీపీఎం నాయకులు వెంకటేశ్వర్లు, పక్కీర్ సాహెబ్ కోరారు. బుధవారం పట్టణంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో ఏడీఏ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఏన్నో ఏళ్ల నుంచి పగిడ్యాల రోడ్డులో గుడిసెలు వేసుకున్ని జీవనం సాగిస్తున్నారన్నారు. అనేక సంవత్సరాల నుంచి కరెంట్ లేక రాత్రి వేళల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఏడీఏ మాట్లాడుతూ గుడిసెలకు తాత్కాలికంగా కరెంట్ మంజూరు చేస్తామని, డిపాజిట్ కట్టుకుంటే విద్యుత్ మీటర్లు బిగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, బుడగ జంగాల కాలనీ వాసులు శివ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు చేసుకోవాలి



ఆర్‌బీకే నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ

కొత్తపల్లి: మండలంలోని ప్రతి రైతు సాగుచేసుకున్న పంటను పంట నమోదు చేయించుకోవాలని ఆత్మకూరు ఏడీఏ బి.ఆంజనేయ సూచించారు. బుధవారం మండలంలోని దుద్యాల రైతు భరోసా కేంద్రాన్ని ఏఓ మహేష్‌తో కలసి తనిఖీ చేశారు. గ్రామ రైతులతో ముఖాముఖి నిర్వహించారు. అనంతరం ఏడీఏ మాట్లాడుతూ రైతులందరూ 2023-24 సంవత్సరానికి గాను ఖరీఫ్‌లో సాగుచేసుకున్న, చేసుకుంటున్న పంటల వివరాలను ఆర్‌బీకే కేంద్రాలలో సిబ్బందిని కలసి నమోదు చేసుకోవాలన్నారు. పొలాన్ని కౌలుకు తీసుకొని సాగు చేస్తున్న రైతులు తప్పనిసరిగా కౌలు కార్డ్ కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గ్రామంలో కొత్తగా నిర్మిస్తున్న రైతు భరోసా కేంఆదం నిర్మాణాన్ని పరిశీలించారు. పనులు వేగవంతం అయ్యేలా చూడాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో గ్రామ రైతు భరోసా కేంద్రం సహాయకులు శేషు తదితరులు పాల్గొన్నారు.

ఈటీడీఏ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు మృతి

శ్రీశైలం: ఈటీడీఏ ప్రెసిడెంట్, కొమరం భీమ్ చెంచుగిరిజన సంక్షేమ సంఘం కార్యదర్శి కుడుముల వెంకటేశ్వర్లు బుధవారం మృతి చెందారు. శ్రీశైలం పరిధిలో మాణిక్యమ్మ సెల చెంచుగూడెం కొమరాం భీం చెంచు గిరిజన సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు వై.ఆశీర్వాదం ఆయన మృతికి సంతాపాన్ని తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ.. ఈటీడీఏ ప్రెసిడెంట్‌గా వెంకటేశ్వర్లు చెంచుల సమస్యల పరిష్కారం కోసం, ప్రధానంగా మాణిక్యమ్మ సెల చెంచుగూడెంలో కరెంట్, మంచినీళ్ల, భూ పట్టాల కోసం పోరాటం చేశారన్నారు. ఐటీడీఏ తరఫున వెంకటేశ్వర్లు కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. పీడీఎస్‌యూ నాయకులు జ్ఞాన దేశిగన్, తోటమాలి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు గోపాల్ నాయక్, మహేష్ రెడ్డి ఉన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

పాములపాడు: మండలంలోని తుమ్మలూరు గ్రామంలో ఐదుగురు పేకాట రాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ అశోక్ బుధవారం తెలిపారు. గ్రామంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో ఎస్ఐ తన సిబ్బంది ఖాజా, అశ్వఖ్‌లతో వెళ్లి దాడి చేసి బోయ దర్గయ్య, పింజరి మాసుం, బస్తిపాడు వెంకటయ్య, వడ్ల భాస్కరాచారి, కుమ్మరి రవిలను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 7,150 నగదును, పేక ముక్కలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు.

జాగ్రత్తలు పాటించాలి

పాములపాడు: ఆరోగ్య సంరక్షణ కోసం ప్రతి ఇక్కరూ జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ గులాబ్‌షా అన్నారు. బుధవారం మండలంలోని వేంపెంట గ్రామంలోని హెల్త్ వెల్నెస్ సెంటరులో వైద్య సేవలు అందించారు. గర్భిణులు తప్పని సరిగా ప్రసవాలు ఆసుపత్రుల్లోనే చేయించుకోవాలని సూచించారు. అనంతరం చెంచు గూడెంలో పర్యటించారు. ప్రస్తుతం వర్షాకాలం అయినందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అలాగే కుష్టు వ్యాధికి సంబంధించి మచ్చలు ఏమైనా ఉన్నాయా అని పరిశీలించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మల్లికార్జున, ఆరోగ్య కార్యకర్త రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముచ్చుమర్రి బ్రిడ్జి పరిశీలన



కొలతలు తీసుకుంటున్న అధికారులు

పగిడ్యాల: కేసీ కాలువపై శిథిలావస్థకు చేరిన పాత ముచ్చుమర్రి బ్రిడ్జిని నీటిపారుదల శాఖ డీఈ రఘురాం రెడ్డి బుధవారం పరిశీలించారు. ప్రభుత్వం ఇటీవల డబల్‌లైన్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.1.48 కోట్లు నిధులు మంజూరు చేసి టెండర్లు పిలిచిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బ్రిడ్జిని భౌతికంగా పరిశీలించి నూతన వంతెన నిర్మాణానికి కొలతలను తీసినట్లు ఏఈ నరేష్ తెలిపారు. ఇంకా పగిడ్యాల వద్ద నూతన బ్రిడ్జికి ప్రభుత్వం రూ. 1.96 కోట్లు మంజూరు చేసిందని వెల్లడించారు. నిర్మాణ పనులు త్వరలోనే చేపట్టేందుకు కొలతలు తీస్తున్నామన్నారు.

కరోనా బాధితులకు సేవలు



కరోనా సమయంలో వికలాంగురాలుకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ రమేష్

కరోనా సమయంలో వైరస్ బారిన పడిన వారిని కుటుంబ సభ్యులు కూడా దగ్గరకు వెళ్లాలంటే భయపడే పరిస్థితి. అలాంటి స్థితిలోనూ నందికొట్కూరు మారుతీ నగర్‌కు చెందిన వలంటీర్ రమేష్ 13వ వార్డులోని రెడ్ జోన్ ప్రాంతానికి వెళ్లి బాధితులకు జాగ్రత్తలు చెప్పి మందులు, పౌష్టికాహారం అందించి తోడుగా నిలిచాడు. అలాగే విపత్కర పరిస్థితిలోనూ పింఛన్లను పంపిణీ చేసి లబ్ధిదారుల మన్ననలు పొందాడు. అంతే కాకుండా ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు సకాలంలో అందించేందుకు తనవంతు సేవలందిస్తున్నాడు. - నందికొట్కూరు

మందులిచ్చి బతికించాడు



మా వలంటీర్ రమేష్ కరోనా సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి పింఛన్ అందించారు. ఆ సమయంలో పలకరించేందుకు బంధువులు కూడా బయటకు వచ్చేవారు కాదు. ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి పథకాన్ని వివరించి ఆ పథకం అందేలా చేశాడు. ముందుగానే కరోనా రాకుండా మందులు ఇచ్చాడు. వలంటీర్లను పెట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న రుణం తీర్చుకోలేనిది.

- కోట ఎల్లమ్మ, మారుతీనగర్, నందికొట్కూరు

కరోనా సమయంలోనూ కొత్త పింఛన్



కరోనా సమయంలో మాలిక్‌బాషా ఇంటి వద్ద సచివాలయ అధికారితో కలిసి నూతన ఫించన్ అందజేస్తున్న వలంటీర్ శ్వేత

ఈమె పేరు శ్వేత, ఆత్మకూరులోని దర్గా మసీదు ఏరియా వలంటరీ. కరోనా సమయంలో ప్రజలు ఇళ్ల నుంచి రావాలంటే భయపడే వారు, ఆ సమయంలో కూడా ఎలాంటి భయాందోళన చెంతకుండా నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ ఇవ్వడమే కాకుండా నూతన పింఛన్ల కోసం దరఖాస్తులు చేయించింది. తన పరిధిలోని కుటుంబాలను నిత్యం సంప్రదిస్తూ కరోనా, సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించేది. కరోనా సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై అవగాహన కల్పిస్తూ, అవసరమైన వారికి కరోనా పరీక్షలు చేయించింది. -ఆత్మకూరు

ఎంతో ధైర్యంగా ఇళ్లవద్దకు వచ్చేది



మా వలంటీర్ శ్వేతమ్మ కరోనా సమయంలోనూ నాతో నూతన పింఛన్ కోసం దరఖాస్తు చేయించింది. అప్పట్లో జిరాక్స్ షాపులు కూడా తెరవలేదు. కరోనా అని ప్రజలు జడుసుకునేవారు. అయినా మా వలంటీర్ ఎంతో ధైర్యంగా ఇళ్లవద్దకు వచ్చి ధైర్యం అందించేంది. నాకు కొత్త ఫించన్ మంజూరు చేయించింది. ఈ పింఛన్ సొమ్ము మా కుటుంబాన్ని ఆదుకుంటుంది. - మాలిక్‌బాషా, దర్గామసీదు ఏరియా, ఆత్మకూరు

కుటుంబ సభ్యురాలిగా..



కరోనా సమయంలో ఇంటింటికి తిరిగి మాస్కులు అందిస్తున్న వలటీర్ మనీషా

ఈమె పేరు మనీషా. అంబేడ్కర్ కాలనీ జీఎల్ఎస్ఆర్ ట్యాంక్ ఏరియాలోని 50 ఇళ్లకు వలంటీర్‌గా సేవలు అందిస్తోంది. కరోనా కష్టకాలంలో కూడా ఆమె తనకు కేటాయించిన ఇళ్ల పరిధిలో కుటుంబ సభ్యురాలిలా వారి బాగోగులను ఆరా తీసేది. ఇంట్లో ఎవ్వరెవరికి దగ్గు, జలుబు, తలనొప్పి, జ్వరం, వళ్లు నొప్పులు ఉన్నాయో తెలుసుకుని వైద్యులకు సమాచారం ఇచ్చి మందులు తెచ్చి ఇచ్చేది. ఇంకా నెల నెల పింఛన్‌లు పంపిణీ చేసి కుటుంబంలో సభ్యురాలిగా మన్ననలు పొందారు.

-పగిడ్యాల

వలంటీర్ సేవతో కరోనాను జయించాం



కరోనా సమయంలో ఇంటింటికి తిరిగి వలంటీర్లు చేసిన సేవలు శ్లాఘనీయం. జలుబు, దగ్గు, వళ్లు నొప్పులు, జ్వరం, తలనొప్పి వంటి రుగ్మతలతో బాధపడే వాడిని. మా వలంటీర్ మనీషా పరీక్షలు చేయించింది. కరోనా అని నిర్ధారణ అయ్యాక నాకు, మా కుటుంబానికి మందులు సరఫరా చేసి అండగా నిలిచింది. వలంటీర్ పడిన శ్రమతోనే కరోనాను జయించాం. - లక్ష్మన్న, పగిడ్యాల

జగనన్నతోనే సంక్షేమ రాజ్యం

- ఎమ్మెల్యే తొగురు ఆర్థర్
- నాగటూరులో 'గడప గడపకు మన ప్రభుత్వం'



నాగటూరులో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే ఆర్థర్

నందికొట్కూరు రూరల్: సంక్షేమ రాజ్యం ముఖ్యమంత్రి జగనన్నతోనే సాధ్యమవుతుందని నియోజకవర్గ ఎమ్మెల్యే తొగూరు ఆర్థర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని నాగటూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను గురించి వివరించి సమస్యలను అడిగి తెలుసుకుంటూ ముందుకు సాగారు. ఆయన మాట్లాడుతూ.. జగనన్న నాలుగేళ్ల పాలనలో అనేక సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరిందని, ఇంకా ఎవరికైనా పథకాలు అందకుంటే గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా తెలుసుకుని పరిష్కరించేందుకు ఇంటింటికీ వస్తున్నామని చెప్పారు. పరిష్కారం కాని సమస్యలు ఏవైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. విద్య, వైద్య రంగాల్లో జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని తెలిపారు. గ్రామాల్లో సచివాలయ వ్యవస్థతో గ్రామ స్వరాజ్యానికి నాంది పలికారని అన్నారు.

అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఎమ్మెల్యే ఆర్థర్ మండల స్థాయి అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం 11 గంటలైనా అధికారులు కార్యక్రమానికి హాజరుకాకపోవడం, సచివాయల సిబ్బంది డ్రస్ కోడ్ పాటించకపోవడంతో ఆయన అధికారులను మందలించాడు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే ఆర్థర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలోని పిల్లలకు వడ్డించే ఆహారాన్ని గురించి సూపర్‌వైజర్ అనురాధను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి చెవుల సుజాత, సింగిల్ విండో చైర్మన్ సగినేల వృశేనయ్య, ఎంపీడీవో శోభారాణి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ షుకూర్, రాష్ట్ర హౌసింగ్ డైరెక్టర్ రమాదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చెంచుల ఆర్థికాభివృద్ధికి కృషి

మహానంది: చెంచుల ఆర్థికాభివృద్ధి కోసం హుండాయ్ మోటార్ ఇండియా వారు కృషి చేస్తున్నారని వీఆర్ఓ సంస్థ డైరెక్టర్ నరసింహారెడ్డి తెలిపారు. మహానంది సమీపంలోని కృష్ణనంది మార్గంలో ఉన్న చెంచుగూడెంలో బుధవారం హైదరాబాద్ నుంచి వచ్చిన కంపెనీ ప్రతినిధులు రోహిత్, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ రామ్మోహన్‌రెడ్డి సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ మామిడి, నిమ్మ, జామ పంటల సాగుపై చర్చించారు. డ్రిప్ పరికరాలను త్వరలోనే ఏర్పాటు చేయిస్తామని తెలిపారు.

12వ పీఆర్సీ ఏర్పాటుపై హర్షం

ఆత్మకూరు: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమానికి 12వ పీఆర్సీ సంఘాన్ని డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం పట్ల ఒప్పంద అధ్యాపకుల సంఘం ఫైనాన్స్ కార్యదర్శి అబ్దుల్‌జబ్బార్ హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ పీఆర్సీలో ఒప్పంద అధ్యాపకుల విషయాన్ని ఆలోచించి న్యాయం చేయాలని కోరారు.

'ఉపాధి హామీ'లో అక్రమాలపై విచారణ

మిడుతూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అక్రమాలపై వచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం మండలపరిధిలోని తలముడిపి గ్రామ సచివాలయం వద్ద గ్రామ సర్పంచ్ వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఏపీఓ జయంతి, ఈసీ నరేష్, టీఏలు గ్రామ సభను ఏర్పాటు చేసి విచారణ చేపట్టారు. విచారణలో కూలీలు పనికి వెళ్లినందున తమకు వేతనం డబ్బులు ఖాతాలకు జమ అయినట్లు రాతపూర్వకంగా వెల్లడించినట్లు ఏపీఓ తెలిపారు. పంచాయతీ కార్యదర్శి కాలుబాషా, వీఆర్వో సంజీవకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఇరు వర్గాల ఘర్షణ

గ్రామసభలో విచారణ పూర్తయిన తర్వాత సచివాలయం వద్ద ఇరు వర్గాల మధ్య మాట మాట పెరిగి పరస్పరం దాడులకు దిగడంతో ఒక్కసారిగా ఉద్రిక్తత చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న ఎస్ఐ మారుతిశంకర్ హుటాహుటిన తలముడిపి సచివాయం వద్దకు చేరుకొని జరిగిన సంఘటనపై ఆరా తీశారు. ఇరువర్గాలకు చెందిన 30 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

చిరుత సంచారం

మహానంది: బండిఆత్మకూరు – మహానంది తెలుగు గంగ కాలువ రోడ్డులో కట్ట వద్ద బుధవారం సాయంత్రం చిరుతపులి కనిపించింది. దీంతో రైతులు భయాందోళనకు గురయ్యారు. నీటిని తాగేందుకే చిరుత అడవిదాటి కాలువ వద్దకు వచ్చినట్లు స్థానికులు తెలిపారు. చిరుత మళ్లీ అడవిలోకి వెళ్లినట్లు ఎఫ్ఆర్ఓ నాసిర్‌ఝా తెలిపారు.



కాలువలో నీళ్లు తాగి గట్టు ఎక్కుతున్న చిరుత